# తలుపులు మూయకండి

శాంతమ్మకు కాళ్ళు, చేతులు, నోరు ఎప్పుడూ పని చేస్తూనే వుండాలి. చిన్నప్పటినుంచి అది ఆమె అలవాటు.

భర్తకు పెద్దహోదా, జీతం, అధికారం వున్న ఉద్యోగం వచ్చాక ఆ అలవాటును చాలావరకు కంట్రోల్ చేసుకొంది.

అయినా ఏ బంగళాలో కొత్తగా అద్దెకు చేరినా, చేరీచేరంగానే చుట్టుపక్కల ఇళ్లను తిరగేసి కులగోత్రాలు తెల్సుకురావటం అన్న అలవాటు అమెను వదల్లేదు.

ఆమె భర్తకు ఇటీవలే ఆ నగరానికి బదిలీ అయింది. పోష్‌లొకాలిటీలో ఖరీదైన ఇంటిని అద్దెకు తీసుకొన్నాడు.

సామానులన్నీ సర్దుకొని పనులన్నీ చక్కబెట్టుకొన్నాక ఆమె పక్క బంగళావాళ్ళను పలకరించి రావటానికి వెళ్ళింది.

అయితే గేటులోనే సింహంలాంటి నాలుగుకుక్కలు పెద్దగా అరుస్తూ ఆమెను అటకాయించాయి. అయినా లోపలినుంచి ఎవరూ రాలేదు. ఆమెను పలకరించలేదు. శాంతమ్మకు ముందు కోపం వచ్చింది. ఆ తర్వాత ఆ ఇంటిగలవాళ్ళ మీద అసహ్యంవేసింది.

''ఎందుకమ్మా నీకీపిచ్చి? వాళ్ళెవరైతే నీకేం? ఎలా పోతే నీకేం? కాలం మారిందమ్మా. మన స్టేటస్‌ను మనం కాపాడుకోవాలి. డాడీ, హెడ్ ఆఫ్ ఎ బిగ్ ఆఫీస్. ఆ విషయం గుర్తుంచుకోవాలి నువ్వు'' కొడుకు, కూతురు కేకలేశారు.

''మనం అడవిలోనో ఎడారిలోనో బతకటంలేద్రా. మనుష్యసమాజంలో వుంటున్నాం. ఇరుగుపొరుగువారెవరో తెల్సుకోకపోతే ఎలా? కష్టసుఖాలని వాళ్ళతో పంచుకోపోతే ఎలా? ఒంటిరాయి శొంఠికొమ్ములా బతకటం నాకు చాతకాద్రా. పక్కింటివాళ్ళతోకూడా టెలిఫోన్‌లో మాట్లాడటం గొప్పా?''

''ఏమైనా నువ్వు ఇక ఎవరిళ్ళకు పిలవని పేరంటంలా వెళ్ళటానికి వీల్లేదు.''

కొడుకు, కూతులు ఆజ్ఞలను శిరసావహించింది శాంతమ్మ.

అయినా ఆమె ఇరుగుపొరుగులందరి చరిత్రలను సేకరించింది. అయితే పక్కింటివాళ్ళ విషయాలు మాత్రం లొకాలిటీలో ఎవ్వరికీ తెలియదు.

ఆమెకు చిత్రమనిపించింది. పక్కింటి వాళ్ళెవరో తెల్సుకోవాలన్న పట్టుదల పెరిగింది. అయితే వాళ్ళెవరో ఎలా తెల్సుకోటం? ఆ ఇంట్లో వాళ్ళెవరో కారులో తప్ప బయటికెవ్వరూ రారు. ఆ కారు వెళ్ళేటప్పుడు చూద్దామన్నా, ఆ కారుకు బయటినుంచి చూస్తే లోపలవాళ్ళు

కనిపించని అద్దాలు వున్నాయి.

ఎదురింటివారి ఇంపోర్టెడ్ కుక్క రోడ్డుమీద వెళ్తుంటే ఏదో వేన్ గుద్దేసింది. కుక్క చనిపోయింది. అప్పుడు చాలా గొడవయింది. పోలీస్ కమీషనర్ అంతటివాడు ఎంక్వయిరీకి వచ్చాడు. కుక్కను ఆ ఇంటివాళ్ళు ఊరేగించి సమాధి చేసేరు. ఆ చిత్రాన్ని చూడటానికి లొకాలిటీవాళ్ళంతా వచ్చారు. కానీ పక్కింటి వాళ్ళు కిటికీలుకూడా తెర్చుకోలేదు.

మరోసారి ఎవరింట్లోనో వాళ్ళ అమ్మాయి పెద్దమనిషైతే పెళ్ళికన్నా ఘనంగా ఆ ఫంక్షన్‌ని చేశారు. లొకాలిటీలో స్త్రీలందరినీ పిలిచారు - పేరంటానికి. అయితే అప్పుడుకూడా పక్కింటినుంచి ఒక్క ఆడపురుగు రాలేదు.

ఆ లొకాలిటీలో అన్ని ఇళ్ళవాళ్ళూ అంతే. కానీ ఆ ఇంటివారిది మరీ చిత్రమనిపించింది. ఎందుకంటే ఆ ఇంటి వారిని ఇంపార్టెంట్ అకేషన్స్‌లో కూడా చూడలేకపోయింది శాంతమ్మ.

అలాంటిది ఆ రోజు ఆ ఇంటిముందు వాళ్ళ కారు ఆగింది. ఆ కారు వెనుక రెండు మూడు లారీలు వచ్చి ఆగేయి.

కారు దిగి ఇద్దరు మగవాళ్ళు, ఇద్దరు ఆడవాళ్ళు లోపలికెళ్ళేరు. ఆ తర్వాత లారీల్లో నుంచి కూలీవాళ్ళు దిగి లోపలి సామానంతా లారీల్లోకి ఎక్కించారు.

''కౌసల్యా! పక్కింటివాళ్ళు ఇల్లు ఖాళీ చేస్తున్నట్లున్నదే. సామానంతా లారీలకు ఎక్కించుకుపోతున్నారు. ఒకసారి పలకరించి వస్తే ఎలా వుంటుందంటావు?''

''ఏడ్చినట్లుంది. వాళ్ళు ఎలా ఛస్తే మనకెందుకట! ఇల్లు వదిలి వెళ్తున్న వాళ్ళని పలకరించి ఏంలాభంట?''

''ఒరేయ్ సురేష్! సామాను తీసుకుపోతున్నది ఇంటివాళ్ళేనంటావా? పోనీ ఒకసారి వెళ్ళి వాళ్ళ విషయం ఏమిటో వాకబు చేసి రారాదూ?'' అంది.

''ఏం? నేనేమన్నా వాళ్ళ వాచ్‌మేన్‌ని అనుకొన్నావా? పిచ్చి ఆలోచనలు చేయకు మమ్మీ?'' అన్నాడు సురేష్.

అయినా శాంతమ్మ రహస్యంగా వెళ్ళి వాకబు చేసింది.

''ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోతున్నాం'' క్లుప్తంగా చెప్పేసి వెళ్ళిపోయారు.

అయిదురోజుల తర్వాత ఆ ఇంటిముందు మళ్ళీ రెండుకార్లు ఆగటం చూసింది. 'వీళ్లెవరో? బహుశా ఇంట్లో చేరటానికి వచ్చిన కొత్తవాళ్ళయి వుంటారు' అనుకొంది.

ఇంతలో పక్కింటిలోనుంచి అరుపులు విన్పించాయి. ఉండబట్టలేక శాంతమ్మ వెళ్ళి పరిచయం చేసుకొంది.

''స్పూను మిగల్చకుండా ఇల్లంతా దోచుకుపోయారు ఎవరో?'' అప్పుడు చెప్పేరు వాళ్ళు.

''అంటే మీకు ట్రాన్స్‌ఫర్ కాలేదా?''

"ట్రాన్స్ఫర్ అయిందా? ఎవరు చెప్పేరు మీకు?" వాళ్ళు అడిగారు.

"సామాను లారీల్లో తీసుకువెళ్ళిన వాళ్ళు చెప్పేరు" అంది శాంతమ్మ.

"అంటే మా ఇంట్లో సామానును లారీల్లో తీసుకుపోవటం మీరు చూశారా?"

"నేనేం? చాలామంది చూశారు. ఎందుకంటే వాళ్లెవరో పట్టపగలు పబ్లిగ్గా కార్లల్లో, లారీలలో వచ్చి రాజాగా తలుపులు తీసుకొని దర్జాగా తీసుకువెళ్లారు. ఈ ఇంటివాళ్ళు మీరని మాకు ఇప్పుడే తెల్సింది."

"అప్పటికీ నేను వాళ్లను అడిగేను. ట్రాన్స్ఫర్ అయిందని చెప్పేరు. మీరే ఈ ఇంటివారని తెలిస్తే వారిని సామాను తీసుకుపోనిస్తామా? పోలీసులను పిల్చి పట్టించకపోయామా? ఇదంతా ఎవరో మీ ధోరణి బాగా కనిపెట్టి చేసినట్లున్నారు."

"అంటే?"

"చూడండి బాబూ. మానవుల మధ్య సంబంధబాంధవ్యాలు పెరిగితే సమాజం ఆరోగ్యంగా వుంటుంది. మనుష్యుల్లో సౌహార్ద్రత, సహకారాలు పెరుగుతాయి. లేకపోతే మనుష్యుల హృదయకవాటాలు మూసుకుంటాయి. అప్పుడు ఇలాంటి అనర్థాలు ఇంకా ఎన్నో సంభవిస్తాయి. మన ధనం, హోదాలు, ఫోన్లు, కార్లు, కుక్కలు మనను అప్పుడు రక్షించలేవు. గుండె తలుపులు మూయకండి."

"ఇది మా స్వంత ఇల్లేనమ్మా! మా ఇంట్లో ఎవరూ ఉద్యోగాలు చేయటం లేదు. మేము వారంరోజులు జాలీట్రిప్కని వెళ్ళివచ్చాం" అన్నారు.

"అలాగా! నేను దొంగలను గుర్తుపట్టగలను. పోలీసులకు ఫోన్చేయండి."

కానీ ఎవరూ ఫోన్చేసే ప్రయత్నం చేయలేదు. అందుకుకారణం వాళ్ళకే తెల్సిన రహస్యం మరి!

స్వాతి సపరి వారపత్రిక 17.2.95